WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
సోమవారం 01-06-2026


# టైటిల్ ఆర్సీబీదే

హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. పవర్‌ప్లేలో వీరిద్దరూ కేవలం 4.3 ఓవర్లలోనే 62 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి కాస్త తడబడినప్పటికీ, ఒకవైపు విరాట్ కోహ్లీ క్రీజులో పాతుకుపోయి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. టిమ్ డేవిడ్ (24) కీలక సమయంలో రాణించాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన కోహ్లీ, 18వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఇంకా 12 బంతులు




మిగిలి ఉండగానే ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు.

# అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు


మొదటి తరువాయి


లేదా శత్రుత్వానికి ముగింపుగా భావిస్తారా అనేది తెలియడం లేదు. ఎంఓయూను కేవలం ఒకే పేజీలో పొందుపరిచారు. దీనిలో దాదాపు డజను అంశాలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ అది అంత తేలికగా తేలే విషయంగా కన్పించడం లేదు.

ట్రంప్ తాజా డిమాండ్లతో పరిస్థితి జటిలం

'వారు ఏయే అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నారో, తొలి దశలో ఏ మేరకు రాయితీలు ఇవ్వడానికి సుము ఖంగా ఉన్నారో స్పష్టంగా తెలియాల్సి ఉంది. అప్పుడే దౌత్య పరిష్కారం సాధ్యపడుతుంది' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణను దీర్ఘకాలిక పరిష్కారంగా మార్చే విష యంపై ఇరుపక్షాలు తాత్కాలికంగా ఒప్పందానికి వచ్చాయని అమెరికా అధికారులు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక డిమాండ్లను తెర పైకి తీసుకురావడంతో పరిస్థితి జటిలంగా మారింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆయన కోరుతున్నారు. దీనికి ఇరాన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశాలలో స్తంభింపజే సిన తన ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతుండగా ట్రంప్ దానిపై పెదవి విప్పడం లేదు. అమెరికా డిమాండ్లు వాస్తవానికి అభ్యర్థనలేనని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై వ్యాఖ్యానించారు. ఏదేమైనా ఎంఓయూపై చర్చలు మాత్రం ఇంకా పురోగతిలోనే ఉన్నాయని తెలుస్తోంది.

హోర్ముజ్‌పై...

హోర్ముజ్ జలసంధిలో మూడు నెలలుగా వాణిజ్య నౌకల రాకపోకలు స్తంభించిపోవడంతో ముడి చమురు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ముందుగా నౌకాయానంపై ఒప్పందానికి రావాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. జలసంధిని వెంటనే తెరవాలని, ఎలాంటి సుంకాలు–నియంత్రణలు లేకుండా నౌకాయానాన్ని అనుమతించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించాల్సిన బాధ్యత ఇరాన్‌దేనని కూడా ఆయన అంటున్నారు. అదే సమయంలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. అయితే ఒమన్‌తో కలిసి అంతర్జాతీయ జలమార్గం మీదుగా నౌకల రాకపోకలను పర్యవేక్షించే హక్కు తనకు ఉన్నదని ఇరాన్ అంటోంది. హోర్ముజ్‌లో ఒమన్ ప్రమేయాన్ని వ్యతిరేకించడంతో పాటు దానికి ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. హోర్ముజ్‌లో ఇరాన్ నియంత్రణలు, ఏర్పాట్లు స్వభావరీత్యా శాశ్వతమైనవని, అవి తాత్కాలికమైనవేమీ కావని పార్లమెంటుకు చెందిన జాతీయ భద్రతా కమిషన్ అధిపతి ఇబ్రహీం అజిజి స్పష్టం చేశారు.

# భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం


మొదటి తరువాయి


అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కోశారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే కొత్తగూడెంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్టు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది పక్కాగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ఏడాది 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూఆర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్ట్రం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల మొత్తం 3.50 లక్షల ఇళ్లకు మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని మరింత పటిష్టంగా రెండో విడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. దేశంలోని చాల రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతో గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు -- ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనాది కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

- కార్మిక కుటుంబాలకు రక్షణ కవచం కోటి రూపాయల ప్రమాద బీమా
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అమలైన పథకంతో 45 కుటుంబాల్లో వెలుగు
-దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ చర్య-నేడు దేశ వ్యాప్తంగా విస్తరణ
-సింగరేణిలో ఇప్పటికే సుమారు 41 కోట్ల రూపాయల బీమా సొమ్ము చెల్లింపు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగుల రాజయ్య. ఆయన ఒక కొడుకు, ఒక కుమార్తె. సింగరేణిలో కార్మికుడిగా నియమకం ద్వారా ఆయన కుమారుడు సంతోష్ ఉద్యోగంలో చేరాడు. కానీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు సంతోష్‌ను కబళించింది. ఆయన సింగరేణిలో చేరి కూడా కేవలం 18 నెలలు మాత్రమే. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రాజయ్య కుటుంబానికి ఆయన కుమారుడు సంతోష్ ఏకైక దిక్కు. సంతోష్ పనిచేసిన 18 నెలల సర్వీసుకు వచ్చే టెర్మినల్ బెనిఫిట్స్ కూడా చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రాజయ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణిలో ప్రారంభించిన రూ.కోటి ప్రమాద బీమా పథకమే ఓ పెద్దకొడుకు ఆదుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్య వృద్ధ దంపతులకు ప్రస్తుతం ఆర్థికభరోసాగా మారింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పెండ్లి లత. ఈమె భర్త రంజిత్ కుమార్. సింగరేణిలో పనిచేసేవాడు. పుట్టిన నెల రోజుల కొడుకును చూసి రావడానికి వెళ్లి వస్తూ ఆయన ప్రమాదవశాత్తు



మరణించాడు. ఆయనకు తండ్రి కూడా లేడు. దీంతో ఆయనపైన ఆధారపడిన భార్య లత, తల్లి, నెల రోజుల కుమారుడు ఒంటరివయ్యారు. అయితే ఆయనకు సింగరేణిలో ఒప్పందం ఉన్న బ్యాంక్ లో శాలరీ ఖాతా ఉండటంతో వారికి కోటి రూపాయలు బ్యాంకు నుంచి వచ్చాయి.. ఈ చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్వయంగా అందజేశారు. దూరమైన తన భర్తను తిరిగి తీసుకురాలేపోయినా... ఆయన నెరవేర్చే బాధ్యతను ఈ సొమ్ము ద్వారా తీర్చగలిగే అవకాశం కలిగిందని, తనకు, తన కుమారుడి భవిష్యత్తు ఇది ఎంతో దోహదపడుతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనకు కూడా అమ్మానాన్న లేరని, ఈ పథకం లేకపోతే తమ కుటుంబం, కుమారుడి భవిష్యత్తు అంధకారమయ్యేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రెండు కుటుంబాల విషయమే కాదు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి లో ప్రవేశపెట్టిన ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఆర్థిక భరోసాను పొందిన 40 మందికి పైగా కుటుంబాల మనోగతం. ఇప్పుడు ఇది సింగరేణిలోనే కాదు దేశ వ్యాప్తంగా లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ చర్య. ప్రమాదాల వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా కుంగిపోయి భిన్నాభిన్నం అయ్యే పరిస్థితుల్లో చిక్కుకున్న జీవితాలకు భరోసాగా నిలుస్తోంది. ఉచిత ప్రమాద బీమా పథకం. రూపాయి ప్రీమియం చెల్లించకుండానే ఉద్యోగులకు, పొరుగు సేవల సిబ్బందికి సింగరేణిలో అమలవుతున్న ప్రమాద బీమా పథకం పై ప్రత్యేక కథనం. కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేయాలి అన్న రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి యాజమాన్యం దేశంలో తొలిసారిగా 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని సింగరేణి సంస్థలో అమలు చేసింది. 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా బీమా రంగంలో ఒక విశ్వవ్యాప్త చర్చగా మారింది. బొగ్గు కంపెనీలతో పాటు, ఇతర సంస్థలు కూడా ఈ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడానికి సింగరేణి సంస్థ స్ఫూర్తిగా నిలిచింది.

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో రేవంత్ భేటీ


మొదటి తరువాయి




ఎస్ఐఆర్ ను తెలంగాణలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల పురోగతిని, బడ్జెట్ ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఖర్గేకు వివరించారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ ను బలోపేతం చేయడం, ప్రభుత్వ పార్టీ సమన్వయాన్ని మరింత పటిష్టం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కేబినెట్ విస్తరణ, కొందరు మంత్రుల మార్పు, పోర్ట్ ఫోలియోల మార్పు విషయాలపై చర్చలు జరుగుతున్నాయి. ఈ వారంలోనే రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కూడా ఈ అంశంపై చర్చించి.. జూన్ రెండోవారంలో కేబినెట్ విస్తరణ చేపడతారని తెలుస్తోంది.

# ఆర్టీసీని బలోపేతం చేస్తాం


మొదటి తరువాయి


వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపడతామన్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మరో పది రోజుల్లో తెలంగాణకు

# నైరుతి రుతుపవనాలు!


మొదటి తరువాయి


రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమొరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాలులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహగాన్ లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36–38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40–42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38–39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# నేడు కుమ్రం భీం -ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం


మొదటి తరువాయి


ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు.

# రైతులను ఆదుకోవాలి


మొదటి తరువాయి


సుప్రీంకోర్టు వరకు వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.



# రాజీవ్ యువ వికాస్ పథకం అమలులో జాప్యంపై నిరసన



**లింగోజిగూడ, మే 31 (నేటి దర్శిని):** రాజీవ్ యువ వికాస్ పథకం కింద అర్హులైన యువతకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం ఇప్పటి వరకు అందకపోవడంపై లబ్ధిదారులు, యువజన సంఘాల ప్రతినిధులు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు తిలక్ రావు ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ సీఎంఆర్ రోడ్డుపై ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తిలక్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం గతంలో రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిందన్నారు. ఈ మేరకు దరఖాస్తుల కోసం యువతను ఎమ్మార్వో కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిప్పి కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం సమయం, ధనం ఖర్చు చేయించారని ఆరోపించారు. 2025 ఫిబ్రవరి 6న ప్రకటించిన ఈ పథకం అమలుపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులను వెంటనే గుర్తించి, మంజూరైన నిధులను విడుదల చేసి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పాటు ఖచ్చితమైన గడువును ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనకారులు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే అమలు చేయడం, అర్హుల జాబితాను ప్రకటించడం, మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయడం, పథకం అమలుకు నిర్దిష్ట గడువు ప్రకటించడం వంటి డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించారు. ఈ కార్యక్రమంలో తూర్పాటి శ్రీకాంత్, నరేష్, కలీం, మురళి, శ్రీను, షఫీ, సాయి, మల్లేష్, దిలీప్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ నాగిళ్ల జగన్ ను సన్మానించిన అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు



**ఆమనగల్లు,మే31(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన అంబేద్కర్ యువజన చైతన్య సభ లో భాగంగా సంఘ సభ్యులు ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ ను శాలువాలతో సన్మానించి వారిని అభినందించారు. సంఘ సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. యువత రాజకీయాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాపిశెట్టి రాము,లండశీ చిన్న జంగయ్య, కామల్ల అంజయ్య,భీమయ్య, అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చూపిన మార్గంలో యువత నడుచుకోవాలి....

- ప్రముఖ సంఘ సేవకులు,కౌన్సిలర్ పాపిశెట్టి రాము...



**ఆమనగల్లు,మే31 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ పట్టణంలో అంబేద్కర్ యువజన చైతన్య సభను ఆదివారం యువజన సంఘం అధ్యక్షుడు లండశీ చిన్న జంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలు,సామాజిక న్యాయం,సమానత్వం,యువత బాధ్యతలు, విద్య మరియు సామాజిక చైతన్యంపై ఆయన మాట్లాడారు. అంబేద్కర్ చూపిన మార్గంలో యువత నడుచుకుంటూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే విద్య,ఐక్యత,సంఘటిత పోరాటం ద్వారా సామాజిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్,సంఘం మాజీ అధ్యక్షులు కామల్ల అంజయ్య,వ్యవస్థాపక అధ్యక్షుడు వంకేశ్వరం భీమయ్య,జంతుక సైదులు వస్పుల సురేష్, రంజిత్,శేఖర్, గుమ్మకొండ రాజు,చాంద్ పాషా,ఎడవల్లి రమేష్ మీసాల రమేష్,ఎండి అప్సర్,తదితరులు పాల్గొన్నారు.

# హన్వాడ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు






- నిర్వహించిన మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్
- నిష్పక్షపాత విధులు, ప్రజలకు సత్వర సేవలపై ఎస్పీ దిశానిర్దేశం



**మిడ్జిల్, మే 31( నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదివారం సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, ఆన్‌లైన్ అప్డేట్స్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసును సమయానుకూలంగా నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత పెంపొందించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్, ఐపిఎస్ ఇచ్చిన ఆదేశాలను జిల్లా ఎస్పీ సిబ్బందికి వివరించారు. నిష్పక్షపాత విధులే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ సూచించినట్లు తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలను కూడా జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బందే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పేర్కొంటూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్న సిబ్బంది ప్రతి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి నేరుగా తనను కలవవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డిసిఆర్బి డీస్పీ రమణా, రూరల్ సీఐ గాంధీ నాయక్, హన్వాడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ డీకే.అరుణ నిధులతో కంచన్‌పల్లిలో ఐమ్యాక్స్ లైట్స్ ప్రారంభోత్సవం పాల్గొన్న జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి

- రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**మిడ్జిల్ మే 31, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని కంచన్‌పల్లి గ్రామంలో పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ నిధుల ద్వారా మంజూరైన ఐమ్యాక్స్ లైట్స్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లైట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ డీకే అరుణమ్మ సహకారంతో గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి, మండల అధ్యక్షులు నరేష్ నాయక్, జిల్లా కార్యదర్శి పోతుల రాజేందర్ రెడ్డి, జిల్లా ఆఫీస్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, ఊరుకొండ మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు శేఖర్, వాసుదేవ్, సీనియర్ నాయకులు నాగేష్, మహేష్, బూత్ అధ్యక్షులు లింగం, నాయకులు నరేష్, బాలు, వడ్డే నవీన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రెడీ టు సర్వ్ ఫౌండేషన్ అన్నదానం

**హైదరాబాద్, మే 31 (నేటి దర్శిని):** సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న రెడీ టు సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ ప్రాంతంలో ఉన్న నీలోఫర్, ఎంఎన్‌జే ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు, నిరుపేదలు మరియు అవసరమైన వారికి రుచికరమైన భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొని వందలాది మందికి ఆహారం అందించారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షిస్తున్న పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. రెడీ టు సర్వ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే వారు తమను సంప్రదించవచ్చని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ తెలిపారు.



## ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులు

**కరీంనగర్, మే 31 (నేటి దర్శిని):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 జిల్లాస్థాయి తరగతులు ఉత్సాహంగా జరిగాయి. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసారమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి--డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, శ్రేణులు సమిష్టిగా వీక్షించారు. ఉద్యమ ఉత్సాహంతో సాగిన శిక్షణా తరగతులు, 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షణతో ప్రత్యేకత సంతరించుకున్నాయి.

# అసలైన తెల్ల గలిజేరు – శ్వేత పునర్నవ

## ప్రపంచ గందరగోళానికి శాస్త్రీయ సమాధానం ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం



శాస్త్రీయ పరిశోధనా విభాగం, ఔషధ మొక్కల గుర్తింపు, ప్రమాణీకరణ ఆయుర్వేద వైద్య శాస్త్రంలో దశాబ్దాలుగా ఒక పెద్ద గందరగోళం నెలకొని ఉంది. అది అసలైన తెల్ల గలిజేరు అంటే ఏది అనే ప్రశ్న. ఈ సమస్యను లోతుగా పరిశోధించి శాస్త్రీయ ఆధారాలతో నిరూపించిన ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం యొక్క అనుపమ కృషిని ఈ వ్యాసం గుర్తిస్తోంది. ఈ సంఘం చేసిన పరిశోధన ఆయుర్వేద ప్రపంచంలో ఒక కొత్త వెలుగును నింపుతోంది. గందరగోళానికి కారణాలు – మూడు మొక్కలు, ఒకే పేరు నేటి మార్కెట్లో, పొలాలలో తెల్ల గలిజేరు పేరుతో ప్రధానంగా మూడు వేర్వేరు మొక్కలు అమ్ముడవుతున్నాయి. ఈ మూడింటిలో కేవలం ఒక్కటే నిజమైన ఔషధ మొక్క. మొదటిది అసలైన తెల్ల గలిజేరు అంటే శ్వేత పునర్నవ. దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా డిఫ్యూసా లిన్ – తెల్ల పూల రకం. ఇది మాత్రమే నిజమైన ఔషధ మొక్క. రెండవది నిటారు గలిజేరు. దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా ఎరెక్టా లిన్. ఇందులో పరిమిత ఔషధ గుణాలు మాత్రమే ఉంటాయి. మూడవది ఎర్ర గలిజేరు అంటే అటక మామిడి. దీని శాస్త్రీయ నామం ట్రయాంథెమా పోర్టులాకాస్ట్రమ్ లిన్. ఇది పూర్తిగా నకిలీ మొక్క. ఇందులో విషపూరిత గుణాలు కూడా ఉంటాయి.

### అసలైన తెల్ల గలిజేరును గుర్తించే విధానం

ఈ క్రింది భౌతిక లక్షణాలను పరిశీలించడం ద్వారా అసలైన శ్వేత పునర్నవను ఖచ్చితంగా గుర్తించవచ్చు. కాండం రంగు పూర్తిగా లేత ఆకుపచ్చ లేదా తెల్లటి రంగులో ఉంటుంది. ఎక్కడా ఎరుపు లేదా గులాబీ ఛాయ ఉండదు. కాండం నేలపై పాకే స్వభావం కలిగి తీగ లాంటి నిర్మాణంతో ఉంటుంది. ఆకులు ఒక మోస్తరు గుండ్రంగా ఉండి అంచులు తరంగాల లాగా వంపు తిరిగి ఉంటాయి. ఒకే కణుపు వద్ద రెండు ఆకులు ఒకదానికొకటి ఎదురెదురుగా అమరి ఉంటాయి. అన్నింటికంటే ముఖ్యమైన లక్షణం పూల అమరిక. చిన్న చిన్న తెల్లటి పూలు గొడుగు ఆకారపు గుత్తులుగా పొడవాటి కాడ చివరన పూస్తాయి.







ఇదే అసలైన శ్వేత పునర్నవకు అతి ముఖ్యమైన గుర్తింపు లక్షణం. వేరు లావుగా ముల్లంగి లాంటి ఆకృతి కలిగి మంచి సువాసన వెదజల్లుతుంది. ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి. నకిలీ మొక్కతో స్పష్టమైన తేడాలు అసలైన శ్వేత పునర్నవ కాండం మృదువుగా నేలపై పాకుతుంది. ఎర్ర గలిజేరు అటక మామిడి కాండం గట్టిగా గరుకుగా ఉంటుంది. అసలైన మొక్క ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి. ఎర్ర గలిజేరు అటక మామిడి ఆకులు మందంగా నీళ్ళు నిండినట్లు ఉబ్బి ఉంటాయి. అసలైన మొక్కకు చిన్న తెల్లటి పూలు గుత్తులుగా కాడ చివరన పూస్తాయి. ఎర్ర గలిజేరు అటక మామిడికి ఒంటరి పువ్వు ఆకు కణుపు మధ్య కాడ లేకుండా అంటుకుని ఉంటుంది. అసలైన మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ అత్యధిక మోతాదులో ఉంటుంది. ఎర్ర గలిజేరు అటక మామిడిలో పునర్నవిన్ అసలు ఉండదు. అసలైన మొక్క మూత్రపిండాలు కాలేయం మరియు గుండెకు అమృతం లాంటిది. ఎర్ర గలిజేరు అటక మామిడి కేవలం విరేచన కారిగా మాత్రమే పనిచేస్తుంది. ఆయుర్వేద ఔషధ గుణాలు ఆయుర్వేద గ్రంథాలైన భావప్రకాశం మరియు చరక సంహితలో శ్వేత పునర్నవను మహాశోథహర అని కొనియాడారు. అంటే శరీరంలో ఎలాంటి వాపులనైనా మూత్రపిండ జబ్బులనైనా నయం చేయగల అత్యుత్తమ మూలిక అని అర్థం. ఈ మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ మూత్రపిండాల పునరుజ్జీవనానికి అత్యంత ఉపయోగపడుతుంది. మూత్రపిండాల వ్యాధుల నివారణకు కాలేయ రక్షణకు శరీర వాపుల తగ్గింపుకు, గుండె రక్షణకు ఇది అమోఘంగా పనిచేస్తుంది. వాత పిత్త కఫ అనే మూడు దోషాలనూ సమతుల్యం చేసే శక్తి ఈ మొక్కలో ఉంది.

### నకిలీ మొక్కలు వాడటం వల్ల జరిగే నష్టాలు

మార్కెట్లో లభించే నకిలీ మొక్కలను అసలైన తెల్ల గలిజేరు అనుకుని వాడటం వల్ల మూత్రపిండ సమస్యలు తగ్గకపోగా రోగం మరింత ముదురుతుంది. అమూల్యమైన సమయం వృధా అవుతుంది. కొన్ని నకిలీ మొక్కలలో విషపూరిత గుణాలు ఉండవచ్చు దాని వల్ల కాలేయంపై అదనపు భారం పడుతుంది. దీర్ఘకాలంలో ప్రాణాలకే ముప్పు కలిగే పరిస్థితులు వస్తాయి. అంతకంటే మించి ఆయుర్వేదానికి అపకీర్తి కలుగుతుంది. ఈ మహా శాస్త్రంపై సమాజంలో నమ్మకం సన్నగిల్లుతుంది. సమాజానికి సందేశం ఏ ఔషధ మొక్కనైనా వాడే ముందు తప్పకుండా ఔషధ మొక్కల నైపుణ్యం మరియు విజ్ఞానం కలిగిన అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులను సంప్రదించండి. సరైన మొక్కలు సరైన మోతాదులో వాడినప్పుడే ఆయుర్వేదం నిజమైన ఫలితాలు ఇస్తుంది. అలా కాకుండా అజ్ఞానంతో నకిలీ మొక్కలు వాడడం వల్ల ఆయుర్వేదానికే చెడ్డపేరు వస్తుంది. ఇది మన అందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండండి. ఔషధ మొక్కల విజ్ఞానం లేకుండా నైపుణ్యం కలిగిన వైద్యులను సంప్రదించకుండా ఏ మూలికనూ వాడకండి. ఆయుర్వేదం అనాదిగా మన జీవితాలను కాపాడిన మహా శాస్త్రం. దాన్ని కాపాడే బాధ్యత మనందరిది. శాస్త్రీయ నిరూపణ పద్ధతులు ఈ పరిశోధన సంఘం రూపశాస్త్ర పరీక్ష అంటే కాండం ఆకు పూల భౌతిక లక్షణాల పరిశీలన ద్వారా మొక్కను నిర్ధారించింది. పాతల పొర వర్ణలేఖన పరీక్ష ద్వారా వేర్లలో పునర్నవిన్ స్థాయిలను నిర్ధారించింది. జీవ సంకేత పరీక్ష ద్వారా జాతిని ఖచ్చితంగా నిర్ధారించింది. పుష్పవిన్యాస అధ్యయనం ద్వారా పూల కాడల అమరిక ఆధారంగా ఎర్ర గలిజేరు అటక మామిడి నుండి తేడాను నిరూపించింది.


ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు
శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి
ఫోన్: 091 99082 89830

---

# నగదు రహిత ఆరోగ్య కార్డుల కోసం ఉద్యోగ ఉపాధ్యాయుల జీతాలలో కోత ?



డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,



తెలంగాణ రాష్ట్రం లోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా అమలు చేయనున్న నగదు రహిత ఆరోగ్య కార్డుల కోసం మే నెల జీతం నుండి 1.5 శాతం కోత పడినట్లు తెలుసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగదు రహిత ఆరోగ్య కార్డుల కోసం విధి విధానాలు ఏమి తెలియకుండా జీతంలో కోత విధించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.గత ప్రభుత్వం లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను పంపిణీ చేయాలని ఎన్నిసార్లు అడిగినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు అయ్యిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చి అమలు చేస్తామని హెల్త్ కార్డుల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు దరఖాస్తు చేయాలని చెప్పడం తెలంగాణ రాష్ట్రం లోని ఉద్యోగ ఉపాధ్యాయుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. హెల్త్ కార్డుల కోసం ఏదైనా ట్రస్ట్ ఏర్పాటు చేస్తారా ? ట్రస్ట్ నిర్మాణం ఏ విధంగా ఉంటుంది.? ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి ఎవరికైనా అవకాశం ఉంటుందా ? ఏ ఏ ఆసుపత్రులలో ఏఏ రోగాలకు చికిత్స చేస్తారు ? ప్రయివేటు, స్పెషాలిటీ హాస్పిటల్స్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ప్రత్యేక మైన చికిత్స చేసే ఆసుపత్రులలో ఎంత టారీఫ్ వరకు ఇస్తారు ? ఇలాంటి అనేక అనుమానాలను నివృత్తి చేయకుండా డి.డి.ఓ ( జీతాలను తెప్పించే అధికారులు) దృష్టికి కూడా తేకుండా మే నెల జీతం లో కోత విధించడం ఆశ్చర్య కరమైన విషయం గా ఉద్యోగ, ఉపాధ్యాయులు అంటున్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల నుంచి కోత విధించాలనుకుంటే మొదలు ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి సమ్మతి తీసుకోవాలని ఏమి చెప్పకుండా ఇప్పటి వరకు ఎప్పుడు ఇలాంటి కోతలు విధించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు అంటున్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇతర మంత్రి వర్గ సభ్యులు తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో మే నెల నుంచి జీతం లో కోత విధిస్తున్న అంశాన్ని తెలపలేదని గుర్తు చేస్తున్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతం నుండి బేసిక్ పే లో 1.5 శాతం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని మే నెల జీతం నుండి కాకుండా జూన్ మాసం లో హెల్త్ కార్డులను జారీ చేసిన తర్వాత అయితే బాగుంటుందని అంటున్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు దీనిపై స్పష్టత లేదని వారు ఒప్పుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఇందిరమ్మ ప్రభుత్వం అని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం దానికి ఉద్యోగులు అమలు చేయడం చేస్తున్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వం లో భాగస్వాములు అని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో చెప్పడం ఉద్యోగ ఉపాధ్యాయులలో స్ఫూర్తిని నింపిందని ఉద్యోగ, ఉపాధ్యాయులు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 వ తేదీ కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్న సందర్భంలో పిడుగు లాంటి వార్త కంటి మీద కునుకు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ మరియు ఇతర మంత్రులు, వివిధ శాఖల ప్రిన్సిపాల్ సెక్రటరీ లు, సంబంధిత అధికారులు ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతం నుండి మే నెల లో కోత విధించకుండా చూడాలని తెలంగాణ రాష్ట్రం లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,అధ్యక్షులు,
తెలంగాణ రాష్ట్ర మహాజన రచయితల సమాఖ్య రాష్ట్ర కమిటీ.
9290826988

---

# భావ సౌరభాలు

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



మధురభావాలు
మదిలో మొలకెత్తి,
మల్లెల పరిమళాలు
వెదజల్లుతున్నాయి॥

ఉన్నతభావాలు
హృదయంలో ఉప్పొంగి,
గోదారి గలగలలు
వినిపిస్తున్నాయి॥

చక్కనిభావాలు
చిన్నగా చిగురించి,
చామంతుల నవ్వులను
విరజిమ్ముతున్నాయి॥

మనోభావాలు
మధువుగా మారి,
మనసుల మధ్య
వంతెనలు కడుతున్నాయి॥

విచిత్రభావాలు
విహంగాలుగా ఎగిరి,
విశ్వ విహారాలకు
తీసుకెళ్తున్నాయి॥

హావభావాలు
హృదయ భాషలై,
హర్షానందాలను
పలికిస్తున్నాయి॥

సాత్వికభావాలు
సవ్వడులు చేస్తూ,
శాంతిసౌఖ్యాలను
సమకూరుస్తున్నాయి॥

సాహితీభావాలు
సరస్వతీ వరాలై,
సృజనకు సరికొత్త రెక్కలు
తొడుగుతున్నాయి॥

భావసంపదలు
కవుల పాలిట కల్పవృక్షాలై,
కమ్మని కవితలను
కూర్పిస్తున్నాయి॥

భావసౌందర్యాలు
పాఠకుల పాలిట పంచామృతాలై,
ఆనంద రాగాలను
ఆలపింపజేస్తున్నాయి॥

---

# వేరొకరి కోసం లంచం డిమాండ్ చేసినా నేరమే

న్యూఢిల్లీ (నేటి దర్శిని)



ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి లంచం, అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు మరింత స్పష్టతనిచ్చింది. లంచాన్ని నేరుగా తీసుకోకపోయినా, మరొక ప్రభుత్వ ఉద్యోగి ద్వారా చేసినా, తన హోదాను ఉపయోగించి కింది ఉద్యోగుల్ని ప్రభావితం చేసినట్టు దర్యాప్తులో తేలితే.. లంచం కేసులో సదరు ఉద్యోగి దోషిగా పరిగణించాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. లంచాలు ఇప్పించే ప్రక్రియను తెరవెనుక నడిపించినా.. నేరానికి బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నది. వ్యక్తిగత పలుకుబడి ఉపయోగించినా నేరానికి పాల్పడినట్టేనని తెలిపింది. తన కోసం కాకపోయినా.. వేరొకరికి అక్రమ ప్రయోజనాన్ని సమకూర్చే ఉద్దేశంతో లంచం డిమాండ్ చేసినా లేదా పొందడానికి ప్రయత్నించినా.. అది నేరమే అవుతుందని ఓ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

## 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

● బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి



**మిడ్జిల్ మే31, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని కంచన్‌పల్లి గ్రామంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సామూహికంగా వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, స్ఫూర్తిదాయక సందేశాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, జిల్లా కార్యదర్శి పోతుల రాజేందర్ రెడ్డి, జిల్లా ఆఫీస్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శులు శేఖర్, వాసుదేవ్, సీనియర్ నాయకులు నాగేష్, మహేష్, బూత్ అధ్యక్షుడు లింగం, నాయకులు నరేష్, బాలు, వడ్డే నవీన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ శిక్షణ మహాభియాన్‌లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

● కార్యకర్తల శిక్షణ, పార్టీ బలోపేతానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్న నవజీవన్ రెడ్డి




**నాగోల్, మే 31 (నేటి దర్శిని):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బండ్లగూడలోని శ్రేయస్ కళాశాలలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్--2026 జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, కార్యకర్తల బాధ్యతలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై నిర్వహించిన వివిధ శిక్షణా సెషన్లలో ఆయన పాల్గొని ఆసక్తిగా విన్నారు. అనంతరం మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సామర్థ్య పెంపు, ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేసేందుకు ఇటువంటి శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి బోనాలు, వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్



**కొత్తపేట, మే 31 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ పరిధిలోని కమర్షియల్ టాక్స్ కాలనీ కమాన్ వద్ద ఉన్న శ్రీ శ్రీ మైసమ్మ దేవాలయం నూతన నిర్మాణం పూర్తై రెండు నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల మహోత్సవ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తుల సంక్షేమం మరియు సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శ్రీ మైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు, బీజేపీ నాయకులు వగ్గల సుందర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**కనగల్, మే31 (నేటి దర్శిని):** కనగల్లు మండలం అమ్మగూడెం గ్రామ సర్పంచ్ కొండా రవళి అంజయ్య దంపతుల కుమార్తె శారీ ఫంక్షన్ ధర్వేశిపురం శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ సన్నిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్ల భవనాల మరియు సినిమా ఆటోగ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మెట్ లో ఘనంగా హిందూ సమ్మేళనం



**అబ్దుల్లాపూర్ మెట్, మే31 (నేటి దర్శిని):** అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అంజనాపురం, జెఎన్ ఎన్ ఆర్ యు ఎం కాలనీ, ఇనాం గూడ, లష్కర్ గూడ, సుర్మాయిగూడ, గుంతపల్లి, మజీద్ పూర్, అనాజ్ పూర్, గండిచెరువు గ్రామాల సమయంతో హిందూ సమ్మేళనాన్ని అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలోని శనివారం నాడు సాయినికేతన్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక వక్త వైఖానస ఆగమ శాస్త్ర పండితులు హనుమాన్ దీక్షితులు, మహిళా వక్త ప్రాంత మహిళ ప్రముఖ స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ కళ్లెం స్వప్న, సామాజిక కార్యకర్త జ్ఞాన సరస్వతి సంస్థల సంఘవక్త సదా వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజల అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హనుమాన్ దీక్షితులు మాట్లాడుతూ... రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో కూడా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంఘ్ విధానాలు, అభిప్రాయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేయాలని కోరుతూ అందరికీ ఆశీస్సులు అందజేశారు. మన పూర్వీకులు, పెద్దలను ఆదర్శంగా తీసుకుని జీవిస్తేనే సనాతన విలువలు నిలుస్తాయని పేర్కొన్నారు. రామాయణం, భారతం, భాగవతం ద్వారా మన సంస్కృతి గొప్పతనం తెలుస్తుందని తెలిపారు. కళ్లెం స్వప్న మాట్లాడుతూ, హిందువులలో ఐక్యత, సంఘటిత శక్తిని పెంపొందించేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఈ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అంజనాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు వెయ్యిన్నర మంది వరకు హాజరయ్యారని పేర్కొన్నారు. భారతదేశాన్ని తిరిగి విశ్వగురు స్థానంలో నిలబెట్టడమే ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యమన్నారు. పంచ పరివర్తన అంశాలను ఆచరిస్తూ వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, దేశ, పర్యావరణ పరిరక్షణ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ సర్పంచ్ మందుగల విజయ శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ....

హిందూ సమ్మేళనానికి విచ్చేసిన వక్తలు, గ్రామ పెద్దలు, యువకులు, పార్టీలకు అతీతంగా పాల్గొన్న రాష్ట్రీయ స్వయంసేవక్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ యువకులు మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా గ్రామ ప్రజలు సానుకూలంగా స్పందించి సహకరించారని అన్నారు. వక్తలు చెప్పిన విషయాలను ఆచరిస్తే సమాజంలో మంచి మార్పు వస్తుందని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, కుటుంబ వ్యవస్థ, వస్త్రధారణ విషయంలో హిందూ సాంప్రదాయాలను పాటించాలని సూచించారు. ఉపసర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్ మాట్లాడుతూ, 1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా అంజనాపూర్ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హిందూ సంస్కృతి, ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించడం వల్ల ప్రజల్లో ఐక్యతా భావం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు , మాజీ గ్రామ సర్పంచులు, మాజీ వార్డ్ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు,ఆర్ఎస్ఎస్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో చిన్నారి చికిత్సకు రూ.1 లక్ష ఎల్‌ఓసీ అందజేత

● పేదలకు అండగా నిలవడమే ప్రజాసేవ లక్ష్యం: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్.బి.నగర్, మే 31 (నేటి దర్శిని):** ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం డివిజన్ ఆదర్శ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న భాస్కర్--లక్ష్మి దంపతుల కుమార్తె దీక్షిత కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి చికిత్సకు సహకరించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆశ్రయించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, చిన్నారి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రూ.1 లక్ష విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరుకాగా, సంబంధిత చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది నిరుపేదలకు సహాయం చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుమార్తె ఆరోగ్య సమస్య విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్థిక సహాయం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చేసిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, గండికోట శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగుట్ట పార్క్ స్థలంపై అధికారుల మౌనం


నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

ప్రభుత్వ పార్క్ భూమి కబ్జా

● అడ్డగుట్టలో అక్రమ నిర్మాణం జోరుగా సాగుతున్నా అధికారుల మౌనం
● ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం
● జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులపై స్థానికుల తీవ్ర ఆరోపణలు


epaper.netidarshini.com | 2026-05-20 | Page: 6

● మెట్టుగూడ సర్కిల్‌లో ఏసీపీ సాయిబాబా డబుల్ గేమ్.?

**సికింద్రాబాద్,మే31 (నేటి దర్శిని):** అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 74/6లో ప్రభుత్వానికి చెందిన పార్క్ స్థలం కబ్జాకు గురైందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్థానికుల ఫిర్యాదులు, పత్రికలో వస్తున్న కథనాల ప్రకారం టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా మెట్టుగూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు విమర్శల పాలవుతోంది. స్థానికుల కథనం ప్రకారం, పార్క్ స్థలాన్ని కొంచం ఆక్రమిస్తూ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నా ఏసీపి సాయిబాబా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. నిర్మాణ యజమానులకు రాజకీయ నాయకుల అండ ఉందనే కారణంతోనే అధికారులు వెనక్కి తగ్గుతున్నారా లేక మామూళ్లు తీసుకొని మౌనంగా ఉన్నారా.? అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద ప్రజలు చిన్న రూమ్ వేసుకున్నా నోటీసులు ఇచ్చే అధికారులు, ఇక్కడ భారీ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారు.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### అనుమతుల కాపీలు అడిగితే తప్పించుకునే ప్రయత్నం

నిర్మాణాలకు సంబంధించి అనుమతి పత్రాలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, వాటి పర్మిషన్ కాపీ చూపించేందుకు అధికారులు లేదా యజమానులు ముందుకు రావడం లేదని వాస్తవానికి అధికారులు చైన్ మెన్ లు పర్మిషన్ కాపీలను ఇవ్వాలి. లేదా నిర్మాణ స్థలం వద్ద గోడకు అంటించాలి కానీ అలాంటిది చేయకుండా వాటిని దాచిపెట్టడం వెనుక టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అధికారులకు అక్రమ నిర్మాణదారుడు లంచాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



అందుకోసమే వాటిని ఎక్కడ బహిర్గతం చేయకుండా మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అనుమతులు అందుబాటులో ఉండాల్సి ఉండగా, "అన్నీ సెట్ అయిపోయాయి" అంటూ కొందరు మధ్యవర్తులు బహిరంగంగానే మాట్లాడుతున్నారట. దీంతో మెట్టుగూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీ స్థాయిలో సెటిల్మెంట్ల దందా నడుస్తోందన్న ఆరోపణలు మరింత బలపడుతున్నాయి.

### జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న ఏసీపి సాయిబాబా

అక్రమ అంతస్తులు, అనుమతులకు మించిన నిర్మాణాలు కొనసాగుతున్నా కూల్చివేతలు చేయకుండా వదిలేయడం వల్ల జిహెచ్ఎంసికి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నదని పట్టణాభివృద్ధి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతుండటమే కాకుండా అసలు పార్క్ స్థలాన్ని అబ్జా చేసి జీవో 58, 59 కింద అక్రమ మార్గంలో తీసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అందాల్సిన పార్క్ స్థలాలు కూడా మాయమవుతున్నాయంటున్నారు స్థానికులు.


### డిప్యూటీ కమిషనర్ మౌనం వెనుక ఏముంది.?

మున్సిపల్ నిబంధనలను పూర్తిగా గాలికి వదిలేసి నిర్మాణాలు సాగుతున్నా మెట్టుగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిడులకు తలొగ్గారా.? లేక సెటిల్మెంట్ల మాయాజాలంలో భాగమయ్యారా.? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే నెంబర్ 74/6లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ పార్క్ స్థలాన్ని రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘడియ గౌరారంలో 15వ ఫైనాన్స్ నిధులపై వివాదం

● అక్రమ లేఅవుట్లకూ ప్రోత్సాహం ఇస్తున్నారంటూ ఆరోపణలు
● కలెక్టర్‌కు వార్డు సభ్యుల ఫిర్యాదు

**చింతపల్లి, మే 31 (నేటి దర్శిని ప్రతినిధి) :** చింతపల్లి మండలంలోని ఘడియ గౌరారం గ్రామపంచాయతీలో 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, గ్రామంలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తూ వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం.. గ్రామ సర్పంచ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుండగా, సర్పంచ్ హేమలత భర్త నరేంద్రరావు గ్రామపంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండానే పలు పనులు చేపడుతున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీకి వచ్చిన 15వ ఫైనాన్స్ నిధుల్లో సుమారు రూ.1.59 లక్షలకు పైగా ఎలాంటి సరైన రికార్డులు లేకుండా డ్రా చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పంచాయతీలో పనిచేసే సిబ్బందికి వారి ఖాతాల్లో జీతాలు జమ చేయకుండా, ఇతరుల పేర్లతో నిధులు ఉపసంహరించు కుంటున్నారని ఫిర్యాదులో తెలిపారు. పంచాయతీ సమావేశాల సమయంలో సర్పంచ్ భర్త కార్యాలయంలోకి వచ్చి వార్డు సభ్యులను అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడడం జరుగుతోందని ఆరోపించారు.



ప్రజావాణి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం https://www.cpgrams.ts.nic.in/citizen/printacknowledgement.php

ప్రజావాణి రసీదు

| | |
|---|---|
| పేరు | :V అంజల్ రావు తదితరులు |
| మొబైల్ నెంబర్ | : 8639115792 |
| అడ్రస్ | :ఘడియ గౌరారం,ఘడియ గౌరారం,చింతపల్లి |
| గ్రామము | :GADYA GOWRARAM |
| మండలం | :CHINTHA PALLE |
| ఫిర్యాదు విషయం | :Requests |

మీ ఫిర్యాదు నమోదు సంఖ్య NLGDC/E/2026/03213 తేది 25/05/2026 భవిష్యత్తు సంప్రదింపులకు మీ ఫిర్యాదు నమోదు సంఖ్యను గుర్తు పెట్టుకోండి. మీ ఫిర్యాదు సంబంధిత అధికారి District Collectorate Nalgonda





అదేవిధంగా గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 25, 26లో వ్యవసాయ భూముల్లో గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటికి సర్పంచ్ భర్త ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై తక్షణమే ప్రత్యేక గ్రామపంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగం, అక్రమ లేఅవుట్ల అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వార్డు సభ్యులు కోరారు.

# ఇసుక క్వారీ ప్రమాదంలో కార్మికురాలు మృతి

● కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన మంత్రి కోమటిరెడ్డి



**కనగల్, మే 31 (నేటి దర్శిని):** కనగల్ మండలంలోని బుధుమర్లపల్లి గ్రామ సమీప వాగులో ఉన్న ఇసుక క్వారీలో చోటుచేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన కార్మికురాలు పాలకూరి సునీత కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరామర్శించారు. సునీత మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా తక్షణ సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని మంత్రి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి



**కనగల్, మే 31 (నేటి దర్శిని):** కనగల్ మండలంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆధునిక వసతులతో కూడిన విద్యా సంస్థల నిర్మాణం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల కలయిక..అవధుల్లేని ఆనందం

● గతాన్ని నెమరేసుకొని... ఆనందాన్ని పంచుకొని ఆప్యాయ పలకరింపులు..
● ఆత్మీయ కరచాలనాలు చదువులమ్మ బడి - అమ్మ ఒడి
● ఘనంగా 2014 -15 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**ఇబ్రహీంపట్నం, మే 31 ( నేటి దర్శిని) :** ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు.. భావోద్వేగ సన్నివేశాలు వెరసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికయ్యింది. యాచారం మండలం కురిమిద్ద ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి 2014 - 15వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు 11 సంవత్సరాల తర్వాత కలుసుకొని చాలా ఉత్సాహంగా గడిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేపట్టారు. గతాన్ని నెమరేసుకొనీ.. ఆనందంగా గడిపారు. ఒకరితో ఒకరు గతాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. భవిష్యత్తులో ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపీ గుర్తులను నెమరువేసుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 11 సంవత్సరాల తర్వాత అందరం కలుసుకొని ఇలాంటి వేడుక నిర్వహించడం, విద్యార్థులు వివిధ రంగాలలో రాణించడం ఎంతో గర్వంగా ఉందని నాటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం బైకనీ శ్రీశైలం యొక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అలనాటి గురువులకు జ్ఞాపికలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, నాటి ఉపాధ్యాయులు అంజయ్య, వెంకటేశ్వర్ రావు, జగన్ మోహన్, రాజేష్, అన్నపూర్ణ, వెంకటచారీ, శ్రీనివాస్, మహేష్, సురేష్, పూర్వ విద్యార్థులు పంది శ్రీనివాస్, నీలం మధు, ఎస్.జగదీష్, నవీన్, ప్రవీణ్, ఎస్.శ్రీను, గోపాల్, వినోద్, శ్రీధర్, రాజు, మణికంఠ, కిరణ్, స్వామి, ఉమ, జ్యోతి, అఖిల, స్పందన, ప్రియాంక, లావణ్య, మౌనిక, శోభ, రోజా, పూజిత, మానస, పద్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ని కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి...



**ఆమనగల్లు,మే31(నేటి దర్శిని);** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం ముఖ్యంగా కల్వకుర్తి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.కల్వకుర్తి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు,ప్రజల అభిప్రాయాలు స్థానిక నాయకత్వం పనితీరు భవిష్యత్తు రాజకీయ వ్యూహాలపై కేసీఆర్ గోలి శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామస్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టాలని గోలి శ్రీనివాస్ రెడ్డిని కెసిఆర్ ఆదేశించారు.

# చిన్నారులతో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న అజయ్ బాబు

● కృష్ణగోపాల సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన సేవ









**ఎల్.బి.నగర్, మే 31 (నేటి దర్శిని):** "మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో పి. అజయ్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కృష్ణగోపాల సేవా సమితి ఆధ్వర్యంలో పేదల బస్తీలో ఆదివారం ఉదయం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన అజయ్ బాబు, వారి ఆనందంలో భాగస్వాములై జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా జరుపుకున్నారు. అనంతరం బస్తీ ప్రజలకు అల్పాహారాన్ని పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధికారులు, సభ్యులు సేవాభావంతో పాల్గొని ఏర్పాట్లను విజయవంతంగా నిర్వహించారు. పేద ప్రజలకు ఆహారం అందించడం ద్వారా సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. అన్నదానం స్వీకరించిన ప్రజలు అజయ్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

# బిజినెస్

## టయోటా సరికొత్త ఈవీ

### ప్రారంభ ధర రూ.23.60 లక్షలు..



**న్యూఢిల్లీ,**
ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఈవీని తీసుకొచ్చింది. టయోటా ఎబెల్లా పేరుతో విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.23.60 లక్షలుగా నిర్ణయించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 541 కిలోమీటర్లు ప్రయాణించనుండగా... 49 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన కారు 344 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 10.1 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లేతోపాటు 10.25 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, ఫిక్స్‌డ్ గ్లాస్ రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే/ఆండ్రాయిడ్ ఆటో, ఎయిర్ ప్యూరిఫైర్, ఆటో ఏసీ, భద్రత ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, అన్ని టైర్లు డిస్క్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

## బంగారం కొనాలనుకుంటున్నారా.. ధరలు ఎలా ఉన్నాయంటే



అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. వివిధ దేశాల ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు ఆటుపోట్లకు గురవుతున్నప్పటికీ బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఆదివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,040గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,950గా ఉంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,190గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,44,100గా ఉంది.
మరోవైపు వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి . ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,90,000గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,80,000గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,90,000గా, బెంగళూరులో రూ.2,80,000గా ఉంది.

**గమనిక:** బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఢమాల్!


### పెరిగిన ధరలతో 30 శాతం వరకు పడిపోయే అవకాశం



న్యూఢిల్లీ,
దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలకు ధరల పెంపు సెగ గట్టిగానే తాకనున్నది. రూపాయి పతనంతో మొబైల్ తయారీ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలు పెంచిన సంస్థలకు అమ్మకాల రూపంలో షాక్ తగలబోతున్నది. వచ్చే పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 30 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉన్నదని నివేదిక వెల్లడించింది. జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ధరలు మరోసారి పెరిగితే వార్షికంగా స్మార్ట్‌ఫోన్ సేల్స్ భారీగా పడిపోనున్నాయని త్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల మంది యాక్టివ్ మొబైల్ కొనుగోలుదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 48 మంది వచ్చే ఆరు నెలల్లో ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేసుకుంటున్నట్టు చెప్పారు. కానీ, ఆరు శాతం మంది తమ వద్ద ఉన్న ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ ఇచ్చి ఇతర స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు భవిష్యత్తులోనూ కొనసాగితే వచ్చే ఆరు నెలల్లో స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ 11-12 కోట్లకు పడిపోనున్నట్టు తెలిపింది. రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సరాసరిగా 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగాయి. ధరల పెరుగుదలే అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని టెకేర్ ఫౌండర్ ఫైజల్ కవూసా తెలిపారు. గడిచిన ఏడాదికాలంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఐదు శాతం పడిపోయింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.

## నాడు ఔట్.. నేడు నాటౌట్.. ఫైనల్ మ్యాచ్‌లో వివాదాస్పద క్యాచ్..

### -- అంపైర్ నిర్ణయంతో మైదానంలో హైడ్రామా!




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య జరుగుతున్న మహా సంగ్రామంలో ఊహించని వివాదం రేగింది. వాషింగ్టన్ సుందర్ అవుట్ చుట్టూ తిరిగిన ఒక హైడ్రామా మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. థర్డ్ అంపైర్ ఇచ్చిన వివాదాస్పద నిర్ణయం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో క్రికెట్ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది.
ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ అంటేనే నరాలు తెగే ఉత్కంఠ. అలాంటి ఈ కీలక పోరులో గుజరాత్ బ్యాటర్లను దెబ్బకొట్టేందుకు బెంగళూరు జట్టు పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. ముఖ్యంగా షార్ట్ పిచ్ బంతులతో ప్రత్యర్థిని ముప్పతిప్పలు పెట్టాలనే బెంగళూరు ప్రణాళిక అద్భుతంగా పాలుపంచుతోంది. ఇదే క్రమంలో జేకబ్ డఫీ వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్ ఆఖరి బంతికి ఒక పెద్ద నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. డఫీ లెగ్ స్టంప్ వైపు వేగంగా విసిరిన షార్ట్ పిచ్ బంతిని, గుజరాత్ బ్యాటర్ వాషింగ్టన్ సుందర్ ఫైన్ లెగ్ మీదుగా సిక్సర్ బాదాలని ప్రయత్నించాడు. కానీ అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న జోర్డాన్ కాక్స్ గాల్లోకి దూకుతూ అద్భుతమైన డైవ్‌తో ఆ క్యాచ్‌ను అందుకున్నాడు.ర్డాన్ కాక్స్ క్యాచ్ పట్టగానే బెంగళూరు ఆటగాళ్లు ఆనందంతో గాల్లోకి లేచారు. వికెట్ పడిపోయిందనే సంబరాల్లో మునిగిపోయారు. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న అంపైర్ నితిన్ మీనన్‌కు క్యాచ్‌పై కొంత అనుమానం రావడంతో, బ్యాటర్ వాషింగ్టన్ సుందర్‌ను మైదానం వీడకుండా అక్కడే వేచి ఉండమని కోరారు. వెంటనే ఈ నిర్ణయాన్ని థర్డ్ అంపైర్ జయరామన్ మదనగోపాల్‌కు బదిలీ చేశారు. పెద్ద తెరపై పునరావృత దృశ్యాలను (రీప్లే) పరిశీలించినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కాక్స్ చేతుల్లో బంతి ఉన్నప్పటికీ, అతను నేలపైకి దూకినప్పుడు బంతి కాస్త గడ్డిని తాకుతున్నట్లు స్పష్టంగా కనిపించింది. బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ లేదని అంపైర్ భావించారు.

**స్క్రీన్‌పై 'నాట్ అవుట్'.. మైదానంలో వాదోపవాదాలు..**
దీర్ఘంగా పరిశీలించిన తర్వాత థర్డ్ అంపైర్ మదనగోపాల్ బ్యాటర్‌కు అనుకూలంగా నిర్ణయం ప్రకటిస్తూ పెద్ద తెరపై 'నాట్ అవుట్' అని ప్రదర్శించారు. దాంతో వాషింగ్టన్ సుందర్ తృటిలో పెను ప్రమాదం నుండి తప్పించుకుని మళ్లీ బ్యాటింగ్ చేయడానికి సిద్ధమయ్యాడు. అయితే ఈ నిర్ణయంపై బెంగళూరు ఆటగాడు రజత్ పాటిదార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అంపైర్ నితిన్ మీనన్ దగ్గరకు వెళ్లి సుదీర్ఘంగా వాదించడం మైదానంలో ఉత్కంఠను మరింత పెంచింది. బంతి చేతి వేళ్ల మధ్యే ఉందని, అది అవుట్ అని బెంగళూరు పట్టుబట్టినా అంపైర్లు మాత్రం తమ నిర్ణయానికే కట్టుబడ్డారు.
క్రికెట్ చరిత్రలో ఫైనల్ లాంటి ప్రతిష్టాత్మక మ్యాచ్‌లలో వచ్చే ఇలాంటి సాంకేతిక వివాదాలు ఆట గమనాన్నే మార్చేస్తుంటాయి. ఈ ఉత్కంఠభరిత క్యాచ్ విషయంలో థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని కొందరు అంటుంటే, బెంగళూరు అభిమానులు మాత్రం దీనిని తప్పుబడుతున్నారు. ఏదేమైనా ఈ ఒక్క నిర్ణయం మ్యాచ్‌లో ఎంతటి ఉత్కంఠను నింపిందో, రాబోయే రోజుల్లో ఎలాంటి చర్చలకు దారితీస్తుందో చూడాలి.

# స్పోర్ట్స్

## ఆసియా క్రీడల బెర్తులు ఖరారు.. మూడు పసికూనలకు అవకాశం..!




ఆసియా క్రీడల్లో పోటీపడే మహిళల క్రికెట్ జట్లు ఖరారయ్యాయి. భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి మేటి జట్లతో చైనా, థాయ్‌లాండ్, మలేషియా తలపడే అవకాశాన్ని దక్కించుకున్నాయి. కౌలాలంపూర్ వేదికగా జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు బెర్తులను ఈ మూడు పట్టేశాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో మలేషియా, థాయ్‌లాండ్ ఫైనల్ చేరగా.. చైనా మూడో స్థానంతో ఆసియా క్రీడలకు అర్హత సాధించింది.మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో మే 26 నుంచి మే 31 వరకూ ఆసియా క్రీడల క్రికెట్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ జరిగింది. గ్రూప్ ఏలో మలేషియా, హాంకాంగ్‌పై విజయాలతో థాయ్‌లాండ్ అగ్రస్థానం సాధించింది. గ్రూప్ బీలో ముందున్న నేపాల్.. సెమీఫైనల్లో మలేషియా చేతిలో ఓడింది. ఫైనల్లో తలపడిన మలేషియా, థాయ్‌లాండ్ జట్లకు నేరుగా ఆసియా క్రీడల బెర్తు దక్కిందిమూడో స్థానం కోసం చైనా, నేపాల్ పోటీపడగా.. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఐదు వికెట్లతో గెలుపొందిన చైనా అర్హత సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ -- అక్టోబర్ మధ్యలో జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చర్, నగొయ ప్రాంతాల్లో ఆసియా క్రీడల క్రికెట్ పోటీలు జరుగనున్నాయి.

**మహిళల క్రికెట్ జట్లు**
భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్, జపాన్, చైనా, మలేషియా, థాయ్‌లాండ్

## వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్..

### టెస్టుల్లో ఆడితే చూడాలనుంది..!



: భారత క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటను దిగ్గజ ఆటగాళ్లు వేనోళ్ల పొగుడుతున్నారు. ఐపీఎల్ 19లో వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు చూసి అతడు నా ఫేవరెట్ క్రికెటర్ అని ప్యాట్ కమిన్స్.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లలో వైభవ్ ఒకడు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చెప్పేశారు. పదిహేనేళ్లకే దునియా మొత్తాన్ని తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలూ దక్కాయి. వైభవ్ చాలా ప్రత్యేకమని, అతడి మణికట్టు మ్యాజిక్ అద్భుతమైని సచిన్ పేర్కొన్నాడు.ప్రపంచ క్రికెట్‌లో వంద శతకాలతో చరిత్ర సృష్టించిన సచిన్ టెండూల్కర్ ఐపీఎల్‌లో దుమ్మురేపిన వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తేశాడు. క్రిక్ఇన్ఫో 21వ శతాబ్దపు ఉత్తమ పురుష క్రికెటర్ అవార్డుకు ఎంపికైన సచిన్ మాట్లాడుతూ వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్ అని చెప్పాడు. వైభవ్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు. సహజసిద్ధంగా అతడికి అబ్బిన క్రికెట్ నైపుణ్యాలతో ఎవరూ పోటీపడలేరు. ప్రతిఒక్కరూ సూర్యవంశీ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, నేను అతడి ఆటను గమనిస్తున్నా. ఎంతో గొప్పగా ఆడుతున్నాడు.అతడు బంతిని బాదే సామర్థ్యం మాత్రమే కాదు అతడు మణికట్టును కదిలించే తీరు అద్భుతం. మైదానం నలువైపులా షాట్లు ఆడాలంటే మణికట్టును మెరుపులా కదలించడం కీలకం. వైభవ్ బంతిని బాదడం కాదు.. లైన్ అండ్ లెంగ్త్‌ను అందరికంటే ముందే పసిగడుతున్నాడు. దాంతో, అలవోకగా బంతిని స్టాండ్స్‌లోకి పంపుతున్నాడు అని వైభవ్ ఆటను విశ్లేషించిన సచిన్ అతడిని టెస్టుల్లో చూడాలని ఆశపడుతున్నట్టు చెప్పాడు.

# రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా

## అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!





పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందటసినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# నెట్టింట 'చిట్టి' హాట్ షో..






## వెంకటేష్-త్రివిక్రమ్

# 'ఏకే47'లో కొత్త ట్విస్ట్..

## కీలక పాత్రలో దేవయాని శర్మ?

టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న చిత్రాల్లో వెంకటేష్ -- త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఏకే47)' ఒకటి. కుటుంబ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ ఇద్దరి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు త్రివిక్రమ్ అందించిన మాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వెంకటేష్‌తో మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ శరవేగంగా సాగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న తరుణంలో సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది.ప్రముఖ వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దేవయాని శర్మ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, సినిమా నడకలో ముఖ్యమైన మలుపులకు కారణమయ్యే పాత్రగా ఉండొచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం ఇంకా గోప్యంగానే ఉంచారు.దేవయాని శర్మకు ఇది కెరీర్ పరంగా మరో పెద్ద అవకాశం కానుంది. ఇప్పటికే 'సేవ్ ది టైగర్స్' ద్వారా కుటుంబ ప్రేక్షకులకు చేరువైన ఆమె, ఇప్పుడు వెంకటేష్-త్రివిక్రమ్ వంటి క్రేజీ కాంబినేషన్ సినిమాలో నటించడం ద్వారా మరింత గుర్తింపు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే, దేవయాని శర్మ నటించిన 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. జూన్ 19 నుంచి ఈ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రానుండగా, గత రెండు సీజన్ల మాదిరిగానే ఈసారి కూడా వినోదభరితంగా ఉండబోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేష్, శ్రీనిధి శెట్టితో పాటు నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వెంకటేష్ నటన ప్రధాన ఆకర్షణలుగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు దేవయాని శర్మ ఎంట్రీ వార్తతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్ర బృందం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.




# విడాకులపై హన్సిక ఎమోషనల్ కామెంట్స్..

**-నా పరిస్థితి చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు..**

సినీ పరిశ్రమలో సెలబ్రిటీల విడాకులు తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. ప్రేమగా మొదలైన బంధాలు అనుకోని కారణాలతో ముగిసిపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంటుంది. తాజాగా నటి హన్సిక తన వైవాహిక జీవితానికి ముగింపు పలికిన అనంతరం మొదటిసారి ఈ అంశంపై బహిరంగంగా స్పందించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త సోహైల్ ఖతూరియాతో విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హన్సిక తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న భావోద్వేగ పరిస్థితులను వివరించారు. జీవితంలో కొన్ని నిర్ణయాలు కఠినంగా అనిపించినప్పటికీ, అవి మన మంచికే అయితే వాటిని ఆలస్యం చేయకుండా తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు.ఒక నిర్ణయం తప్పు అని అనిపిస్తే దాన్ని సరిదిద్దుకోవడానికి వెనుకాడకూడదు. గత రెండేళ్లుగా నా మానసిక పరిస్థితి చాలా ప్రభావితమైంది. సాధారణంగా నేను చాలా ఉల్లాసంగా, ఆనందంగా ఉండే వ్యక్తిని. కానీ ఆ సమయంలో పూర్తిగా నిశ్శబ్దంగా, బాధతో ఉండేదాన్ని. నా పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు కూడా చాలా ఆందోళన చెందారు అని హన్సిక తెలిపారు. తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఒక స్నేహితురాలు అండగా నిలిచిందని ఆమె చెప్పారు. నా పరిస్థితిని గమనించిన ఓ స్నేహితురాలు డాక్టర్‌ను సంప్రదించి నాకు థెరపీ అవసరమని సూచించింది. ఆ తర్వాత నేను కౌన్సెలింగ్ తీసుకున్నాను. ఆ ప్రక్రియ నాకు ఎంతో సహాయపడింది. ఈ రెండేళ్లు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పించాయి. సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, ఎలా ముందుకు సాగాలి అనే విషయాలు నేర్చుకున్నాను అని వెల్లడించారు. విడాకుల తర్వాత తనపై సోషల్ మీడియాలో, మీడియాలో వచ్చిన ప్రచారాలపై కూడా హన్సిక స్పందించారు. ప్రజలు ఎక్కువగా సంచలన వార్తలనే ఇష్టపడతారు. అందుకే నా గురించి కూడా అనేక రకాల గాసిప్స్ ప్రచారంలోకి వచ్చాయి. అయితే వాటికి నేను ఎప్పుడూ వివరణ ఇవ్వలేదు. భవిష్యత్తులో కూడా ఇవ్వాలనుకోవడం లేదు. ఇతరులు ఏమనుకుంటారన్నది కంటే నా సంతోషం నాకు ముఖ్యం అని స్పష్టం చేశారు. అలాగే తమ విడాకుల నిర్ణయం పరస్పర అంగీకారంతో తీసుకున్నదేనని హన్సిక తెలిపారు. వివాహం అనేది ఇద్దరి వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడాలి. కానీ మా పరిస్థితిలో అది జరగలేదు. అందుకే మేమిద్దరం కలిసి ఈ నిర్ణయం తీసుకున్నాం అని చెప్పారు. ప్రస్తుతం తాను జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నానని, ఎవరికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా జీవిస్తున్నానని హన్సిక వెల్లడించారు. ఒంటరిగా గడపడం, ఆధ్యాత్మిక యాత్రలు చేయడం ద్వారా మనశ్శాంతి పొందుతున్నానని తెలిపారు. ఈ కష్టకాలంలో తన కుటుంబ సభ్యులు అందించిన మద్దతును ఆమె ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు

# ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా



ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365